www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 30 సెప్టెంబర్ 2023

5

వైఎస్ఆర్

భారత పార్లమెంట్‌కు కడప యువతి

కడప అర్బన్ : భారత పార్లమెంట్‌కు కడప నగరానికి చెందిన యువతి జాగెంగొండ అరుణ ఎంపికైనట్లు నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ సంసదలకు నివాళి అనే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో 'మహాత్మా గాంధీ జీవన విధానం ఆయన అనుసరించిన పద్ధతులు, 'అమృత్ కాల్‌లో లాల్ బహదూర్ శాస్త్రి జీవిత పాఠాలు' అనే అంశం పై నిర్వహించిన పోటీల్లో విజయం సాధించారన్నారు. దేశ స్థాయి లో నిర్వహించే కార్యక్రమంలో 25 మంది ఎంపిక కాగా, వారిలో కడపకు చెందిన యువతి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. అక్టోబర్ 2 న నిర్వహిస్తున్న జాతీయ నాయకులకు నివాళి అనే కార్యక్రమం పై పార్లమెంట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం తరఫున కడప జిల్లా నుంచి ఆమె పాల్గొంటారన్నారు.

చిన్న పరిశ్రమలకు చేయూతనిచ్చేనా!

యూనిట్‌కు 15 శాతం సబ్సిడీ- అక్టోబర్ నుంచి నూతన పాలసీ

ఇండస్ట్రియల్ నూతన పాలసీ చిన్న పరిశ్రమలకు చేయూతనివ్వడం సందేహాలకు తావిస్తోంది. పెట్టుబడి రాయితీ, జగనన్న బడుగు వికాసం స్కీముల కింద చిన్న, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన మేరకు సబ్సిడీలను ప్రకటించింది. గత పాలసీ తరహాలోనే సబ్సిడీలు ఉన్నప్పటికీ వాస్తవంగా పరిశీలిస్తే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఐదేళ్లపాటు లభించే ఆర్థిక ప్రయోజనాలను కుదించినట్లు తెలుస్తోంది. యూనిట్ వ్యయానికి మించి లభించే ప్రయోజనాల్ని యూనిట్ వ్యయానికి సమానంగా చేసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ మొదటి వారంలో నూతన పాలసీ అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలపై ఇండస్ట్రియల్ నూతన పాలసీ చిన్న, సూక్ష్మ, పెట్టుబడి రాయితీ స్కీములపై గణనీయమైన ప్రభావం చూపనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 1231 పెట్టుబడి రాయితీ, చిన్న, సూక్ష్మ పథకాల యూనిట్లలో ఒసి, బిసిలకు 15 శాతం, ఎస్‌సి, ఎస్‌టి లకు రూ.45 శాతం సబ్సిడీతో రూ.85.16 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. ఇందులోని 1,130 ఎస్‌సి, ఎస్‌టి యూనిట్లకు రూ.77.05 కోట్లు రాయితీ రూపంలో రీయింబర్స్ చేయడం తెలిసిందే. తాజా పరిశ్రమల పాలసీలో పెట్టుబడి రాయితీ పథకం యూనిట్‌దారునికి 15 శాతం సబ్సిడీతో రూ.20 లక్షలు ప్రయోజనం చేకూరనుంది. ఒసి, బిసి మహిళలకు అదనంగా మరో రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షలు సబ్సిడీ లభించనుంది. కరెంటు యూనిట్‌కు రూపాయి చొప్పున వెసులుబాటు లభించనుంది. ఐదేళ్లపాటు యూనిట్ కార్యకలాపాలు నిర్వహించిన ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు 100 శాతం రీయింబర్స్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల ద్వారా 25 శాతం సబ్సిడీ చొప్పున రూ.10 లక్షలు లభించే అవకాశాలు ఉంది. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పథకం కింద సర్వీస్, మాన్యుఫ్యాక్షరింగ్ యూనిట్ల లబ్ధిదారులకు 45 శాతం సబ్సిడీ వర్తించనుంది. ఈలెక్కన ఎస్‌సి, ఎస్‌టి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో అత్యధికంగా ఉన్నట్లు ఉండడం గమనార్హం. ఐదేళ్లపాటు యూనిట్‌ను కొనసాగిస్తే పెట్టుబడి మొత్తాన్ని రాయితీ రూపంలో రీయింబర్స్ చేస్తోంది. ఈలెక్కన మాన్యు ఫ్యాక్షరింగ్ యూనిట్ దారునికి సుమారు రూ.1.20 కోట్లు ప్రయోజనం చేకూరనుంది. ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌లో సుమారు రూ.75 లక్షల మేర ప్రయోజనం లభించనుంది. స్టాంప్‌డ్యూటీ చెల్లింపుల దగ్గర నుంచి ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీల్లో 25 శాతం, కరెంటు ఛార్జీల్లో యూనిట్‌కు రూ.1.50, వడ్డీ రాయితీ కింద తొమ్మిది శాతం మేర ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. వీటితోపాటు టర్మ్‌లోన్లకు మూడు శాతం మేర గరిష్టంగా రూ.25 లక్షలు సబ్సిడీ లభించనుంది. ఏదేమైనా గత పరిశ్రమల పాలసీతో పోలిస్తే 2023-27 పాలసీలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ప్రయోజనాల్ని పెట్టుబడికి సమానంగా సబ్సిడీ, ఇతర ప్రయోజనాల్ని ముడిపెట్టారనే విమర్శ వినిపిస్తోంది.

కేసులకు, జైళ్లకు భయపడేది లేదు

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-కడప అర్బన్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన సందర్భంలో శనివారం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించబోతున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు తెలిపారు. శుక్రవారం సంధ్యాకు వెళుతూ కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ టిడిపి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల టిడిపి అమరావతి ప్రధాన కార్యాలయంలో పొలిటికల్ యాక్షన్ కమిటీని నియమించామని పేర్కొన్నారు. మొదటి సమావేశం అమరావతిలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశాలు జనసేనతో కలిసి అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. బాబుపై అక్రమ కేసులు పెట్టి సిఎం జగన్మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందంతో ఉన్నారని విమర్శించారు. ఉగ్రవాది కంటే ఘోరంగా బాబుని అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన చోటే సమావేశం ఏర్పాటు చేసి కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నామని పేర్కొన్నారు. సిఎం మతిస్థిమితం లేని వాడిగా పనిచేస్తున్నారని విమర్శించారు. ఆధారాలు, సాక్ష్యాధారాలు ఉంటే చూపించాలంటే ఇంతవరకు చూపలేదని ఎద్దేవా చేశారు. ఆరోపణలు నిజమైతే ఏ షెల్ కంపెనీ, ఏ వ్యక్తికి, మంత్రులకు, కుటుంబ సభ్యులకు, టిడిపికి ఒక పైసా వచ్చిందో నిరూపించాలని చెప్పారు. సిఐడి అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు సూటిగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్డు పేరుతో లోకేష్‌ను అరెస్టు చేసేందుకు జగన్ సిద్ధమయ్యారని పేర్కొన్నారు. అక్రమ కేసులకు జైళ్లకు భయపడేది లేదని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు లింగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బిటెక్ రవి, పుత్తా నరసింహారెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, గోవర్ధనరెడ్డి, మైదుకూరు, ప్రొద్దుటూరు, కడప ఇన్‌ఛార్జులు పుట్టా సుధాకర్ యాదవ్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాధవి, నాయకులు సిఎం సురేష్‌నాయుడు, లక్ష్మిరెడ్డి, వికాస్ హరికృష్ణ, టిడిపి మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణ భద్రత.. సామాజిక బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రజల ప్రాణ భద్రత మనందరి సామాజిక బాధ్యత అని, ఆ దిశగా జిల్లాలో రహదారుల భద్రత కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, ఆబ్కారీ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి వాహన ప్రమాదాలను అరికట్టే దిశగా భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవలి కాలంలో కడప-కర్నూలు ప్రధాన రహదారిలో చెన్నూరు వద్ద చోటు చేసుకున్న భారీ రోడ్డు ప్రమాదం పలు కుటుంబాలలో విషాదాన్ని నింపిందని చెప్పారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతా నియమాలు, సూచికలు, నినాదాలతో ప్రచురించిన గోడ పత్రాలను, హ్యాండ్ బుక్ లను జిల్లా కలెక్టర్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ (ట్రాన్స్ పోర్ట్) కమిషనర్ మీరా ప్రసాద్, పీఆర్ ఎస్.ఈ శ్రీనివాసులు రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ మాధవి, డిఎంహెచ్ఓ. నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఆర్అండ్‌బి, విద్యుత్ శాఖల ఎఈలు ట్రాఫిక్, పోలీస్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. **ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం**

బద్వేలు : స్థానిక సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కారం అందించేలా 'మండల స్థాయి జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మండల స్థాయి 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ డి. సుధ, బద్వేలు మున్సిపల్ చైర్మన్ వి.రాజగోపాల్ రెడ్డి, జెసి గణేష్ కుమార్, బద్వేలు ఆర్‌డిఒ వెంకట రమణ హాజరై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం చేతకాని తనానికి నిదర్శనం

కడప అర్బన్ : మాటతప్పం, మడమతిప్పం అంటూ ఇచ్చిన హామీ మేరకు ఒపిఎస్ అమలు చేయకుండా సిపిఎస్‌ను జిపిఎస్‌గా మార్చి చేతులు దులుపుకోవడం సిఎం చేతకానితనానికి నిదర్శనమని ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఒపిఎస్ అమలు చేస్తే అప్పులు పుట్టవనడం, ఆర్థికవ్యవస్థ ఇబ్బందుల్లో పడుతుందనడం, కేంద్రప్రభుత్వం ఒప్పుకోదు అనడం లాంటి అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఆలోచించి, జిపిఎస్‌పై పునరాలోచించి ఒపిఎస్‌ను అమలు చేసి ఉద్యోగుల పట్ల తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య, రాష్ట్రనాయకులు ఇలియాస్ బాషా, సురేష్ బాబు, సీనియర్ నాయకులు హైదర్ వలి పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

పోరుమామిళ్ల : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో ఆటో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో దాదాపు 500 ఆటోలున్నాయని కార్మికులు ప్రజలకు వారధిగా, అనుసంధానంగా ఉన్నారన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ ప్రమాద బీమా సౌకర్యం రూ. ఐదు లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. గతంలో రెండు సంవత్సరాలుకు ఎఫ్‌సి రెన్యువల్ ఉండగా ఇప్పుడు సంవత్సరానికే తగ్గించడం దుర్మార్గమన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. ఆటో కార్మికులకు హౌసింగ్ బోర్డు కింద ప్రభుత్వం ఆటోనగర్ ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలో గాంధీ విగ్రహం,ఆర్టీసీ బస్టాండ్ ,అంబేద్కర్ సర్కిల్లో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షులుగా బొజ్జా. చిన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా జాల గురయ్యా ,సహాయ కార్యదర్శులుగా దాసరపల్లే చిన్నప్ప, ఎ.ఎ పాలెం వీర పోగు భాస్కర్, అక్కి దాసరి రమణ, రమేష్ బాబు ఉపాధ్యక్షులుగా కొండయ్య పుష్ప రాజ్ ,కొడవడిగంటి గురయ్యా ,విజయభాస్కర్ ,కళ్యాణ్, మల్లికార్జున, ప్రసాద్, దానం ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్ నాయకులు సభ్యులు సిఐటియు మండల నాయకులు రత్నం, రవి పాల్గొన్నారు.

పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బరాయుడు

కడప అర్బన్ : కడప సౌత్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా నల్లబల్లె సుబ్బరాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్‌ను అన్ని విషయాల్లో ముందంజలో నడిపేందుకు అందరి సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉండాలని కోరారు. నెలలో డిసిడిపి(డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం నిర్దేశించబడిన ప్రదేశంలో ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 11న రామాపురం, నవంబర్ 8న సిద్దవటం, డిసెంబర్ 13న బాలతిమ్మయ్య పల్లెలో, జనవరి 10 న మాధవరం, ఫిబ్రవరి 14న ఎర్రముక్కపల్లె, మార్చి 13 న రవీంద్రనగర్‌లో కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ డిసిడిపి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమం లో భాగంగా పోస్టల్ పథకాలు, చిన్న మొత్తాల పొదుపులు, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, సేవల గురించి వివరించారు.

ఎం.ఎస్.స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరనిలోటు

ఎపి రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి కడప అర్బన్

స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎం.ఎస్. స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరని లోటని ఎపి రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి అధ్యక్షతన ఎం.ఎస్. స్వామినాథన్ సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఎం.ఎస్.విశ్వనాథన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం కడప జిల్లా గౌరవాధ్యక్షులు మాట్లాడుతూ భారతదేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ ఇక లేరన్న విషయం అందరినీ కలిచివేసే అంశం అన్నారు. 98 ఏళ్ల వయసున్న స్వామినాథన్ చెన్నైలోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారని తెలిపారు. 1925 ఆగష్టు 7న మద్రాసు ప్రెసిడెన్సీలోని కుంభ కోణం ప్రాంతంలో జన్మించారని తెలిపారు. ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమద్ధి సాధించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు. అధిక దిగుబడినిచ్చే వరి రకాలను అభివద్ధి చేయడంలో ఆయన కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఇది భారతదేశంలోని తక్కువ ఆదాయ గల రైతులు ఎక్కువ దిగుబడిని ఉత్పత్తి చేయడానికి సహాయ పడిందన్నారు. స్వామినాథన్ 1987లో చెన్నైలో ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను స్థాపించారని చెప్పారు. దాని ద్వారా ఆయన మొదటి ప్రపంచ ఆహార బహుమతిని అందుకున్నారని తెలిపారు. 1971లో రామన్ మెగసెసే అవార్డు, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ సైన్స్ అవార్డు అందుకున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి స్వామినాథన్ అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కొనియాడారు. ప్రతి రైతు సంక్షేమంలోనూ స్వామినాథన్ జీవించి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏ.పీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, సిపిఎం నగర కార్యదర్శి ఏ.రామ్మోహన్ డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, వామపక్ష రైతు సంఘాల నాయకులు మనోహర్ రెడ్డి, బాలచంద్రయ్య, శేఖర్ సిఐటియు నాయకులు చంద్రారెడ్డి, విద్యార్థి సంఘం నాయకుడు ఎం.ఆర్.నాయక్ పాల్గొన్నారు.

ఆటో, టాక్సీ వృత్తికి గౌరవం పెరిగింది : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర ప్రభుత్వం ఆటో, టాక్సీ వృత్తినే నమ్ముకున్న పేద బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిసూత సమాజంలో గౌరవాన్ని కూడా పెంచుతోందని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ పేర్కొన్నారు .శుక్రవారం విజయవాడ విద్యాధరిపురం బహిరంగ సభ నుంచి 'వైఎస్ఆర్ వాహన మిత్ర' 5వ ఏడాది లబ్ధి మొత్తాన్ని. వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుంచి డిఆర్ఒతోపాటు జిల్లా ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పోరేషన్ చైర్ పర్సన్ బి.విజయలక్ష్మి, టిటిడి బోర్డు మెంబర్ యానాదయ్య, పూసర్ల (కృష్ణ బలిజ) కార్పొరేషన్ డైరెక్టర్ విజయ కుమారి, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టి. పి. వెంకట సుబ్బమ్మ హాజరయ్యారు. సిఎం వీడియో కాన్ఫిరెన్సు ముగిసిన అనంతరం జిల్లా రవాణా శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో"వైఎస్ఆర్ వాహన మిత్ర' ద్వారా ఈ ఏడాది జిల్లాలో లబ్ధి పొందిన 11,094 మంది ఆటో, టాక్సీ ఓనర్లకు మంజూరైన రూ.11, 09,40,000ల మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి డిఆర్ఒ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్ఒ గంగాధర్ గౌడ్ మాట్లాడుతూ ఆటో, క్యాబ్, ట్యాక్సీలు నడుపుకుని జీవించే పేద డ్రైవర్లకు 'వైఎస్ఆర్ వాహన మిత్ర' పథకం ద్వారా ఆర్థిక భద్రత కల్పించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. వాహనాల ఫిట్‌నెస్, బీమా, మరమ్మతులు, ఇతర అవసరాల కోసం ప్రతి ఏటా లబ్ధిదారులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందుతోందన్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, సిఐలు, కానిస్టేబుల్స్, హోం గార్డులు, వాహన మిత్ర లబ్దిదారులు పాల్గొన్నారు.

7 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం

కడప : నగరంలోని వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన మ్యాచ్ లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై 7 వికెట్ల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 257 పరుగులు చేసింది. ఆ జట్టులోని అర్జున్ టెండూల్కర్ 103 పరుగులు (సెంచరీ) చేశాడు. జహీర్ అబ్బాస్ 55 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని వంశీ నారాయణ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 258 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 49.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని ఎస్. వి. రాహుల్ 121 పరుగులు (సెంచరీ) చేశాడు. ఏ. వి. వి. విజయ్ 72 పరుగులు చేశాడు.

కెఒఆర్ ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్ లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై 147 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్ లో విజయనగరం జట్టుపై 6 వికెట్ల తేడాతో కృష్ణ జట్టు విజయం సాధించింది.

అసెంబ్లీ తీర్మానంపై బుడగ జంగాల హర్షం

కడప : బుడగజంగాలను ఎస్‌సిలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానించడం హర్షణీయమని బేడ బుడగ జంగం సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డి. శ్రీరాములు అన్నారు. సంక్షేమ సంఘం కృషి ఫలమే రాష్ట్రంలో ఈ విజయం అని పేర్కొన్నారు. తక్షణమే కేంద్రంలో కూడా తమ సమస్య తీర్చాలని కోరారు. శుక్రవారం వైసిపినాయకులు బంగారు నాగయ్య సమక్షంలో డిప్యూటీ సిఎం అంజాద్ బాషాను శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అల్లూరయ్య, వెంకటేష్, మదర్, నాగరాజు,గోవింద్, రాముడు, మహేష్, ఎస్. సుంకన్న, సింగోటం, ఓబులేసు, శ్రీను, పెద్ద ఎత్తున బుడజంగం కాలనీ వాసులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

పటేల్ రోడ్డు లో ఉన్న మిత్ర యోగా సెంటర్ లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్ ను అక్టోబర్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ రంగనాథ్ రెడ్డి, డాక్టర్ కల్పన ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు.

నాటు బాంబును పరిశీలిస్తున్న డిఎస్‌పి నాగరాజు

నాటు బాంబు కలకలం

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణంలోని ముద్దనూరు రోడ్డు పెన్నానది సమీపాన ఉన్న స్థలాల్లో నాటు బాంబు లభ్యమయింది. శుక్రవారం డిఎస్‌పి నాగరాజు, అర్బన్ సిఐ సదాశివయ్య, ప్రత్యేక పోలీస్ బృందంతో సంఘటనా స్థలాన్ని సందర్శించారు. గతంలో ఈ ప్రాంతంలోనే సుమారు 54 నాటు బాంబులు లభ్యమయ్యాయి. దీంతో జమ్మలమడుగు ప్రాంత ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురు అయ్యారు. జమ్మలమడుగు ఫ్యాక్షన్‌కు పెట్టింది పేరు. గతంలో ఫ్యాక్షన్ మహమ్మారికి వందల ప్రాణాలు గాల్లో కలిశాయి. జమ్మలమడుగు ప్రాంతంలో ఎప్పుడు ఎక్కడ ఫ్యాక్షన్ హత్య జరుగుతుందో అని ప్రజలు బిక్కుబిక్కుగా జీవనం సాగిస్తుండేవారు. నాటు బాంబులు విసిరి ప్రత్యర్థులను మట్టుపెట్టేవారు. ప్రస్తుతం నాటు బాంబు లభ్యం కావడంతో పెన్నా నది సమీపంలో ఇంకా ఎన్ని నాటుబాంబులు ఇసుకలో ఉన్నాయో అని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ దృష్టి సారించి మిగిలిపోయిన నాటు బాంబులను వెలికితీతకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన సిడిసి డీన్‌కు గజమాలతో సత్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

నూతన సిడిసి డీన్ కె. రఘుబాబును వైవీయూ ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాల అధ్యక్షులు విజయ్ కుమార్ సెక్రటరీ శ్రీను గజమాలతో సత్కారం చేశారు. శుక్రవారం డీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధి మండలి సిడిసి కళాశాలకు అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అనంతరం పూర్వపు సిడిసి డీన్ సుబ్బరాయుడు కలిసి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సంజీవ రెడ్డి, అలీ అక్బర్, ఫరూక్, సుధీర్, నాగేశ్వర్ రెడ్డి, శంకర్, నారాయణ, వర్మ, చంద్ర, శేఖర్, రాజేష్, సిద్ధ, నరేంద్ర పాల్గొన్నారు.

నకిలీ పత్రాల తయారీదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కడప

నకిలీ పత్రాలు తయారీదారులపై పోలీసు శాఖ చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప నగర పరిధిలో నకిలీ పత్రాల తయారీదారులు దందా రోజు రోజుకి మితిమీరి పోతుందన్నారు. వీటి పైన పోలీస్ శాఖ నిఘాపెట్టి నకిలీ పత్రాల తయారీదారుల పై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మామిళ్ళపల్లి పొలం సర్వేనెంబర్ 570 ఎటువంటి రికార్డుపత్రాలు లేవని, మండల రెవెన్యూ అధికారులు ద్వారా తెలియజేశారు అన్నారు. ఇటీవలనగరం పరిధిలో 50 డివిజన్ దండు హరిజనవాడలో డోర్ నెం72/247లో ఉన్న యజమాని ఆరోగ్యం పరిస్థితి బాగో లేక కుటుంబం మొత్తం మరణించారని, కొందరు వారి నివాస పత్రాలు నకిలీ పత్రాలుగా రూపొందించి , ఆ ఇంటిని ఆక్రమించుకున్నారని వాపోయారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ కుమార్, డప్పు చంద్ర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాలగిరి శివ

వేంపల్లె : ఇడుపులపాయలో సిఎం గెస్ట్‌హౌస్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

- పోలీసుస్టేషన్ల తనిఖీల్లో ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీ అనంతరం మాట్లాడుతూ పులివెందుల డివిజన్ పరిధిలో పోలీస్‌స్టేషన్ల తనిఖీల్లో భాగంగా ఇక్కడికి వచ్చామని చెప్పారు. మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతి భద్రతలకు సంబంధించి పోలీస్ అధికారులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. స్పందనలో, జెకెసిల్లో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. భూ సమస్యలకు సంబంధించి ఆయా శాఖ అధికారులతో సమావేశమై పరిష్కారం దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదారులతో మంచిగా మాట్లాడి ఆ సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి తెలిపారు. అంత కుమునుపు పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డిఎస్‌పి వినోద్‌కుమార్, అర్బన్ సిఐ రాజు, రూరల్ సిఐ మద్దిలేటి, ఎస్‌ఐలు హుసేన్, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** నేరాలు నిరోధానికి అప్రమత్తంగా విధులు నిర్వహించడంతో పాటు నేరాలు ఆరికట్టేందుకు పోలీసు సిబ్బంది నిరంతరం కృషి చేయాలని ఎస్‌పి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని వేంపల్లె ఆర్కే వ్యాలీ(ఇడుపులపాయ) పోలీసుస్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఇడుపులపాయలోని సిఎం బస చేసే గెస్ట్ హౌస్, వైఎస్ఆర్ ఘాట్, హెలిప్యాడ్ లను పరిశీలించారు. ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టే పోలీసు విధులపై ఎస్‌పి ఆరా తీశారు. సిబ్బంది పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీసులకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. పాఠశాలల్లో, పబ్లిక్ ప్రదేశాలలో డ్రగ్స్, చైల్డ్ మ్యారేజెస్, దిశ యాప్, మహిళలపై జరిగే నేరాలు , ఆన్ లైన్, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకొని శాంతి భద్రతలకు విఘాతం లేకుండా చేయాలని చెప్పారు. ఆయన వెంట ఆర్కే వ్యాలీ సిఐ గోవిందరెడ్డి, ఎస్ఐ తిరుపాల్‌నాయక్, ఎఆర్ పోలీసులు పాల్గొన్నారు. **చక్రాయపేట :** నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి పరిశీలించారు. ఆయనకు ఎస్ఐ వినోద్ కుమార్ బొకే అందించి స్వాగతం పలికారు. స్టేషన్‌కు చుట్టుపక్కల నూతనంగా నిర్మించే భవనాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ గోవింద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఒఎన్‌జిసి శాస్త్రవేత్తలు వైవీయూ సందర్శన

కడప అర్బన్ : ఆయిల్ అండ్ నాచ్యురల్ గ్యాస్ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు కడప బేసిన్‌లోని సహజవాయు నిక్షేపాల అన్వేషణలో భాగంగా వైవీయూ జియాలజీ విభాగపు ఆచార్యులు ఆహ్వానం మేరకు యూనివర్శిటీకి వచ్చారు. విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వెంకట సుబ్బయ్య , ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఇలాంటి పరిచయాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు విద్యార్థులతో ముఖాముఖీ చర్చించారు. భూగర్భ శాస్త్రంలో ఉన్న అవకాశాల గురించి వివరించారు. వారు ప్రస్తుతం చేస్తున్న అన్వేషణ గురించి చెప్పారు. కార్యక్రమంలో జియోలజీ విభాగాధిపతి ఆచార్య రఘు బాబు, ఆచార్య సునీత, ఆచార్య జయరాజు, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, సిద్ధిరాజు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పోరుమామిళ్ల టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఈనెల 30న చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యరదర్శి వీరపోగు రవి పేర్కొన్నారు. శక్రవారం ఆయనకు స్థానిక ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ముందస్తు నోటీసు అందజేశారు. చలో విజయవాడకు వెళ్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

మోకాళ్లపై నిరసన



నిరసన తెలియజేస్తున్న టిడిపి నాయకులు

కడప అర్బన్ : టిడిపి అధినేత నేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ కడప నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. శుక్రవారం టిడిపి నాయకులు బిట్లా శ్రీధర్ అధ్యక్షతన నిరసన కొనసాగించారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగోవర్ధన్ రెడ్డి, హరి ప్రసాద్, నగర అధ్యక్షులు శివ కొండారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, కొమ్మలపాటి సుబ్బరాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

- డిఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం జయప్రదం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు కోరారు. శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 అంచెలలో పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ఆరోగ్య విషయాలపై సమాచారం సేకరిస్తారని పేర్కొన్నారు. ఎఎన్ఎం ఆరోగ్య వివరాలు నమోదు చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటికీ ఎఎన్ఎం ఎఎన్ఎం, సిహెచ్ఒ వెళతారని తెలిపారు. ఏడు పరీక్షలు చేస్తారన్నారు. హెల్ప్ డెస్క్, రిజిస్ట్రేషన్ కౌంటర్లు, టోకెన్ పద్ధతిలో పరీక్షలుటాయని పేర్కొన్నారు. డాక్టర్లు, కంటి వైద్యులు, గైనకాలజిస్ట్ ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేస్తారని తెలిపారు. వైద్య పరీక్షల కోసం పాఠశాలలు, సచివాలయాలను వినియోగించుకుంటారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా చేస్తారన్నారు. కార్యక్రమాన్ని తహశీల్దార్లు, ఎంపిడిఒ ప్రజా ప్రతినిధులు పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. శనివారం ఒక్కరోజే 36 క్యాంపులుంటాయని తెలిపారు. సమావేశంలో ఎన్ హెచ్ ఎం డిపిఎంఒ నాగ శశిభూషణ్ రెడ్డి, వెంకట చంద్రారెడ్డి, రమేష్ రెడ్డి, నారాయణ, రమణమ్మ, మరియమ్మ, ఉమామహేశ్వరి, కుమారి పాల్గొన్నారు. **చాపాడు :** మండల పరిధిలో ఈనెల 30 నుంచి అక్టోబర్ 18 వరకు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి టి.లక్ష్మమయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధి లోని ఎన్ఓబాయపల్లి గ్రామంలో శనివారం నిర్వహించబోయే ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలోనూ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ఇద్దరు మండల వైద్యులతో పాటు మరో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుభాని, డాక్టర్ రాజేష్, శ్రీవాణి, కావ్య మాధురి, సిహె చ్ ఒ మహాదేవ యాదవ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి, మండల నాయకులు సోముల మహేశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు .

పంట నమోదుకు నేడు చివరి గడువు

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు సాగు చేసిన పంటలు నమోదు చేసుకునేందుకు శనివారం చివరి గడువుని మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లబల్లెలో శుక్రవారం పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఇంకా పంట నమోదు చేసుకోకుంటే వెంటనే చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 4,391 మంది రైతులకు గాను 12,785 ఎకరాల్లో పంటలను పంట నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రతి ఒక్క రైతు తప్పకుండా ఈ కేవైసి చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. **చాపాడు :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇకెవైసి శనివారం లోగా తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ఆర్‌బికెలలో విఎఎల ద్వారా ఇకెవైసి చేయించుకోవాలని పేర్కొన్నారు. మండల పరిధిలో 2700 మంది రైతులు పంటలు సాగు చేయగా ఇప్పటి వరకు 1300 మంది పూర్తి చేశారని తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ కమిటీ నిర్వాహకులు

వీరభద్ర స్వామి హుండీ ఆదాయం రూ.12 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయం శాశ్వత హుండీలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఇఒ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయ హుండీ ఆదాయం రూ. 12,14,430 లక్షలు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి నేటి వరకు ఉన్న శాశ్వత హుండీలను లెక్కించామని తెలిపారు. గత ఏడాది రూ. 10,04,880 ఆదాయం వచ్చిందని, ఈ సారి అధనంగా హుండీ ఆదాయం రూ. 2,09,550 ఆదాయం పెరిగిందన్నారు. శాశ్వత హుండీల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి ఏ శ్రీనివాసులు, మాజీ చైర్మన్ జి.టి. వెంకట సుబ్బా రెడ్డి, మెంబర్ వెంకట రమణ, దేవస్థాన అర్చకులు కె నాగ శివ ప్రసాద్ కె. భరత్ కుమార్ శర్మ , వి నరేంద్ర శర్మ , పోలీస్ సిబ్బంది గంగాధర్, బ్యాంక్ సిబ్బంది టి.సుబ్బి రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. **బ్రహ్మంగారి మఠంలో..** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠంలో హుండీల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. .స్వామివారి హుండీల ద్వారా రూ. 21, 10, 315 లక్షలు వచ్చినట్లు ఆలయ ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి పేర్కొన్నారు. బంగారు 18 గ్రాములు, వెండి 425 గ్రాములున్నాయని తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్ పాల్గొన్నారు.

గర్భస్థ శిశువులను కాపాడే బాధ్యత అందరిది

ప్రజాశక్తి - వేంపల్లె

గర్భస్రావాలు, భ్రూణ హత్యలు నివారించడంతో పాటు గర్భస్థ శిశువులను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా అన్నారు. శుక్రవారం వేంపల్లెలోని దళితవాడలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు బెటీ బచావో భేటీ పడవో, భ్రూణ హత్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆహార ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో పాటు పాలతో చేసిన పదార్థాలు, మాంసం తగిన మోతాదులో తీసుకోవాలని కోరారు. తల్లికి ఎక్కువగా శక్తి లభించే ఆహార పదార్థాలు ఇవ్వడం వల్ల తక్కువ బరువుతో ఉన్న పిల్లలు పుట్టకుండా ఉంటారని చెప్పారు. గర్భిణులు తల్లి ఆరోగ్యానికి, బిడ్డ పెరుగుదలకు సరిపోయేంత ఆహారం కొంచెంకొంచెంగా ఎక్కువ సార్లు తినాలని కోరారు. ఆడ, మగ ఇద్దరు సమానంగా చూడాలని చెప్పారు. బాలిక ల మనుగడే దేశ ప్రగతికి మూలం అన్నారు. ఆడ శిశువుల సంఖ్య పెంచడమే భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మి దేవి అంగన్వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 9 దుంగలు, రెండు కార్లు స్వాధీనం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలో రెండు కార్లలో లోడ్ చేస్తున్న 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్సు డిఎస్‌పి జి.చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి టీమ్ గురువారం కడప టాస్క్ ఫోర్సు సబ్ కంట్రోల్ నుంచి ఖాజీపేట, బద్వేలు వైపు వెళ్లింది. ఖాజీపేట సెక్షన్ పత్తూరు ఫారెస్ట్ బీటు పరిధిలో నాగపట్నం రోడ్డు, పత్తూరు సమాధుల వద్ద రెండు కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. టీమ్ అక్కడికి చేరుకోవడంతో నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నింగా ముగ్గురు పట్టుబడ్డారు. పట్టుబడిన వారిలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన సుందరవేల్ కుప్పం పార్తీబన్ మురుగన్ , కృష్ణగిరి జిల్లా రమేశ్ మునియప్ప లుగా గుర్తించారు. కారులో లోడ్ చేసిన ఐదు , కింద పడి ఉన్న మరో 4 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఫోర్డు , రినాల్డ్ డస్టర్ కార్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేశారు. ఎస్ఐ మోహన్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామీణులను వణికిస్తున్న జ్వరాలు

ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న ప్రజలు

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు

జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న బాధితుడు

ప్రజాశక్తి - చాపాడు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఏర్పడిన మార్పులకు గ్రామీణ ప్రాంతాల్లో విష జ్వరాలు వణికిస్తున్నాయి. మండలంలోని ఏ గ్రామంలో చూసినా ఇంటికి ఒకరిద్దరు చొప్పున మంచానపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. వైరల్, టైఫాయిడ్, మలేరియా జ్వరాలో అధిక శాతం మంది బాధపడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు అధిక సంఖ్యలో జ్వరపీడితులు చికిత్స కోసం వచ్చారు. మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్, శ్రీవాణి రోగులను పరీక్షించారు. జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. వైరల్, టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. కొంతమందికి జలుబు, దగ్గుతో సాధారణ జరాలు కూడా నమోదు అవుతున్నాయని వారు తెలిపారు. జ్వరం సోకగానే వైద్యశాలకు వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారు. గ్రామాలలో మురికి గుంతలలో దోమలు వృద్ధి చెంది జ్వరాలు అధికంగా వస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఎన్ ఓబాయపల్లి, పల్లవోలు, చాపాడు ఎస్సీ కాలనీ, ఖాదర్ పల్లె, ద్వారకానగరం తదితర గ్రామాల్లో అధికంగా జ్వరాలు వస్తున్నట్లు సమాచారం. తాగునీటిని కాచి వడబోసి తాగాలని వైద్యులు సూచిస్తున్నారు.

కుటుంబంలో అందరికీ జ్వరం..

నాలుగు రోజులుగా కుటుంబంలోని అందరికీ జ్వరం వస్తోంది. ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నా జ్వరం తగ్గడం లేదు. చాపాడు పిహెచ్‌సిలో రక్త నమూనాలు సేకరించారు. జ్వరంతో కుటుంబం మొత్తం ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. **-బి.నాగేష్, ఎన్.ఓబాయపల్లె**

జ్వరంతో బాధపడుతున్నాం..

మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నా. వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతున్నప్పటికీ జ్వరం తగ్గడం లేదు. మా కాలనీలో ఎక్కు వమంది జ్వరంతో బాధపడుతున్నారు. ప్రతి ఇంటిలో జ్వరాలు వస్తున్నాయి. వైద్య సిబ్బంది రక్త నమూనాలు సేకరించి మాత్రలు అందించారు.

- ఓబులమ్మ, ఎస్సీ కాలనీ, చాపాడు.

వాతావరణ మార్పులతోనే జ్వరాలు..

వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల టైఫాయిడ్, సాధారణ వైరల్ జ్వరాలు ఎక్కువమందికి వస్తున్నాయి. గ్రామాలలో ప్రతి ఇంటికీ వెళ్లి జ్వర బాధితులను గుర్తించి వైద్యశాలకు తీసుకువచ్చేలా సిబ్బందిని అప్రమత్తం చేశాం. శనివారం నుండి ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. జ్వరం సోకగానే వైద్యశాలకు వచ్చి ప్రజలు చికిత్స పొందాలి. నీటిని కాచి వడబోసి తాగుతూ, ఇంటి పరిసరాలలో దోమలు నిల్వ లేకుండా చూసుకోవాలి.

- డాక్టర్ రాజేష్ కుమార్, మండల వైద్యాధికారి.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో మెప్మా అధికారులు, ఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల్య వివాహాలను అరికట్టాలంటే స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన చాలా అవసరం అన్నారు. ప్రతి సంఘ సమావేశంలో ఒక లక్ష్యం పెట్టుకొని బాల్యవివాహాల వల్ల బాలికలకు జరిగే అనారోగ్య సమస్యల గురించి వివరించాలన్నారు. స్వచ్ఛభారత్, జగనన్న సురక్ష గురించి సమావేశంలో చర్చించారు. మెప్మా అధికారి గంగులయ్య మాట్లాడుతూ చట్టాలను వ్యతిరేకించి చేసే పెళ్లి కూతురు అమ్మానాన్నలకు, పురోహితునికి, బంధుమిత్రులకు అందరికీ రెండు సంవత్సరాలు జైలు శిక్ష ఉంటుందన్నారు. సమావేశంలో మెప్మా అధికారులు ఉషారాణి, ఆర్‌పిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **కొండాపురం:** మండలంలోని నేదరపేట పంచాయతీ పాఠశాల భవనంలో 'బాల్య వివాహాల నిరోధక చట్టం-2006' అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె. సుశీలమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎఎన్ఎం స్వర్ణలత మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని, నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే హెల్ప్‌లైన్ నంబర్ 1098' కాల్ చేయాలన్నారు. కార్యక్రమలో మహిళా పోలీస్ నజ్మ, ఆశావర్కర్ గంగమ్మ, ఎడడ్ల్యూడబ్ల్యూ గంగాదేవి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. **కలసపాడు :** మండలంలో మారుమూల గ్రామాలలో జరిగే బాల్యవివాహాలను అరికట్టాలని ఎంపిడిఒ మహబూబ్‌బీ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు హరిప్రియ, రత్నకుమారి ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మహిళా పోలీసులు ఐసిడిఎస్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. **ఖాజీపేట :** బాల్యవివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరం, ప్రతి ఒక్కరు వివాహ కనీస వయసును అనుసరించాలని అంగన్వాడీ పర్యవేక్షక అధికారులు శ్రీదేవి భారతీ రమాదేవి, మహిళా పోలీస్ తవ్వాలీలావతి ఎర్కొన్నారు. శుక్రవారం స్థానిక అగ్రహారంలోని అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహాల పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఖాజీపేట : మాట్లాడుతున్న అంగన్వాడీ పర్యవేక్షక అధికారి

సింహాద్రిపురం : మండలంలోని నిడువెలగల సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గురుదేవి, మహిళా పోలీస్ భరణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంత కుమారి విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** బాల్యవివాహాలపై అవగాహన కలిగి ఉండాలని 9వ వార్డు 10వ సచివాలయ మహిళా పోలీస్ సంధ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయంలోవార్డు కౌన్సిలర్ సత్యంతోపాటు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోరాదని, ఆడపిల్లకి 18, మగపిల్లలకు 21నిండే వరకు పెళ్లి చేసుకోకూడదని, ఒక వేళ చేసుకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎం.విజయ,బి.సుజాత, బి.సులోచన, పి.మల్లిక, వి.శ్యామల, సుభాషిని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా మార్గంతో వైద్య సేవలు అందించాలి

ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సమాజంలోని పేద పీడిత రోగులకు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా మార్గంతో వైద్య సేవలను అందించాలని, ఆస్పత్రి సేవలను స్థానికులు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బొల్లవరం రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ద్రితి ఆస్పత్రిని ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు గుండె జబ్బులతో ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారి కోసం ఇక్కడ ప్రత్యేక ఆస్పత్రిని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఆస్పత్రి అధినేత డాక్టర్ పేర్ల వెంకట చెంచయ్య, డాక్టర్ అనూషలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రొద్దుటూరులో ప్రథమంగా కార్డియాలజీ ఆస్పత్రిని అందుబాటులోకి తేవడం సంతోషదాయకమని పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే సకాలంలో గుండె సంబంధ చికిత్సలు చేయించుకునేందుకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని సూచించారు. ఆస్పత్రి వైద్యులు డాక్టర్ పేర్ల వెంకట చెంచయ్య, డాక్టర్ అనూష మాట్లాడుతూ తాము గతంలో నంద్యాలలోని శాంతి రామ్, హైదరాబాద్‌లోని హృదయాలయాల్లో పని చేశామని స్టాంట్ల ఏర్పాటులో ప్రత్యేక అనుభవం ఉందని చెప్పారు. ఎవరికైనా హార్ట్ అటాక్ సంభవిస్తే 24 గంటల్లో చికిత్స చేయించుకుంటే గుండె పదిలంగా ఉంటుందన్నారు. తమ ఆస్పత్రిలో డైరెక్ట్‌గా స్టాంట్ వేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, ఎం.వి. మురళీధరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

జిపిఎస్ ప్రతులు దహనం

చాపాడు : అసెంబ్లీలో ఉద్యోగ ఉపాధ్యాయులకు భద్రత లేని జిపిఎస్ బిల్లు ఆమోదించినందుకు నిరసనగా శుక్రవారం మైదుకూరు ఎంఇఒ కార్యాలయ ఆవరణలో జిపిఎస్ బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ మర్చిపోయారన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయకుండా నమ్మకద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో రీజినల్ కన్వీనర్ బి.కె. సురేష్ కె.వి రాజు రమణయ్య, ఈశ్వరయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిజెపి, వైసిపి రాష్ట్రానికి రాహుకేతువులు : కాంగ్రెస్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

బిజెపి,వైసిపి రాష్ట్రానికి రాహు, కేతువుల్లాగా దాపురించాయని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని అప్పుల పాలు చేసిందన్నారు. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాల కాలంలో పండిట్ నెహ్రూ మొదలుకొని మన్మోహన్‌సింగ్ వరకు 13 మంది ప్రధాన మంత్రుల కాలంలో కేంద్ర ప్రభుత్వం కేవలం రరూ.46వేల కోట్లు అప్పులు చేయగా 2014 నుంచి 2023 వరకు కేవలం 9 సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం రూ.1,09,000 కోట్లు అదనంగా అప్పు చేసిందన్నారు. దేశంలోని విమానాశ్రమాలు, రైల్వేస్టేషన్లు, ప్రభుత్వ సంస్థలు, ఎల్ఐసిలాంటి సంస్థలను అమ్మకానికి పెట్టిందన్నారు. వంటగ్యాస్, ఇంధనం, ఎరువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవన్నారు. కాంగ్రెస్ పాలనలో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 140 డాలర్లుండగా లీటర్ డీజల్ రూ.50, పెట్రోల్ రూ.70 అందించేదన్నారు. సరఫరా అయిందని మోడీ పాలనలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ 30 నుండి 40 డాలర్లున్నప్పటికీ లీటర్ డీజల్ రూ.100 ,పెట్రోల్ రూ.112లు ఉండడం శోచనీయం అన్నారు.మోడీపాలనలో గతంలో ఎన్నడూ లేనిస్థాయిలో నిరుద్యోగం పెరిగిందన్నారు.

డ్రైడేపై అవగాహన అవసరం

- జిల్లా మలేరియా అధికారి మనోరమ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి ఒక్కరికీ డ్రైడేపై అవగాహన అవసరమని జిల్లా మలేరియా అధికారి మనోరమ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి, కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గోపవరం పంచాయతీ ద్వారానగర్, సోములవారిపల్లె పంచాయతీ సుబ్బారావు కొట్టాల, ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు అందరూ వారం వారం డ్రైడే పాటించాలని, దోమల నివారణ చర్యలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముందు జాగ్రత్త గా చేపట్టిన ఫీవర్ సర్వే, లార్వ సర్వే చేస్తున్న సిబ్బందికి సలహ సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, హెచ్ఇ శోభరాణి, సూపర్ వైజర్ బి.ఎ. వర ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పి శిరీష, ఆరోగ్య కార్యకర్తలు ఉమారాణి, జ్యోతి, ఆశాకార్యకర్తలు బాలనాగమ్మ, శివజ్యోతి పాల్గొన్నారు. **వేంపల్లె :** జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు పేర్కొన్నారు. శుక్రవారం డ్రైడే సందర్భంగా వేంపల్లెలోని హరిజనవాడలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. ఆకాల వర్షాల కారణంగా నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పారు. వాటి నివారణకు ఆయా ప్రాంత వాసులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. దోమకాటు వల్ల విష జ్వరాలు ప్రబలి అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. దోమకాటుకు దూరంగా ఉండాలని కోరారు. జ్వరాలు ప్రబలిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ తర్వాత మందులను వాడాలని చెప్పారు. డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, ఎఎన్ఎం లక్ష్మి దేవి, ఆశాలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న జడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచ్

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లెలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి జడ్‌పిటిసి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జగనన్న కాలనీలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కాలనీ వాసులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని చెప్పారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు హసనయ్య, పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, హౌసింగ్ ఎఇ సుకుమార్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపిటిసి కంచెర్ల గంగరాజు, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, గుజిరి దర్బార్, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను మహిళలే ఓడిస్తారు : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

మద్యపాన నిషేదం విషయంలో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మహిళలను నమ్మించి మోసం చేశారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆయన్ను మహిళలే ఓడిస్తారని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాపురాల్లో మద్యం చిచ్చు పడుతుందని చెప్పారు. దీంతో మానవ సంబంధాలు ధ్వంసమైపోతున్నాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 3 దశల్లో మద్యం నిషేదిస్తాం, మద్యాన్ని 5 స్టార్ హోటళ్లకు మాత్రమే పరిమితం చేస్తామని వైసిపి తన మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. మహిళలు నమ్మి ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పేట్లు ఫిరాయించి రివర్స్ గేర్ మార్చినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకున్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయం రూ. 92 కోట్లు అన్నారు. మద్యంపై వ్యాట్ ద్వారా వచ్చే అదాయం అదనం అన్నారు. ఇవి చాలక ఆంధ్రప్రదేశ్ బెవరేజెస్ కార్పొరేషన్ ద్వారా మందు బాబులను తాకట్టు పెట్టి జగన్ ప్రభుత్వం రూ.12000 కోట్లు అప్పు తెచ్చిందని తెలిపారు. అమ్మఒడి, చేయూత, ఆసరా, విద్య దివెన లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఇచ్చే డబ్బులు నాన్న బుడ్డికి చాలడం లేదన్నారు. మద్యపాన నిషేదం వైకాపా నవరత్నాల్లో ఒకటి అన్నారు. నకిలీ, రంగురాళ్ళు రత్నంగా మారడం శోచనీయం అన్నారు.

ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని అఖిలపక్ష పార్టీ నాయకులు కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శుక్రవారం వేంపల్లెలోని రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల పోలింగ్ బూత్‌లపై అయా పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 44818 ఓట్లు ఉండగా వాటిలో పురుషులు 21934, మహిళలు 22881 ఓట్లున్నాయన్నారు. 64 పోలింగ్ బూత్‌లు ఉన్నట్లు చెప్పారు. 1500 ఓట్లు దాటిన పోలింగ్ కేంద్రాలను రెండుగా విడగొట్టి కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందు కోసం అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏ ప్రాంత ప్రజలకు అ ప్రాంతంలోనే పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని అయా రాజకీయ పార్టీల నాయకులు తహశీల్దార్‌ను కోరారు. దూర ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గతంలోనూ బిడ్డాలమిట్ట, శ్రీరాం నగర్, రాజీవ్ నగర్ ప్రాంతంలో ఉన్న వారికి బస్టాండ్ ఏరియా ప్రాంతంలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడంతో చాలా మంది ఓట్లు వేయలేక పోయారని కాబట్టి వాటి పట్లపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో వైసిపికి చెందిన జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, టిడిపి పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మహమ్మద్ ఇనాయతుల్లా, కాంగ్రెస్ నాయకుడు ధృవకుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వేమయ్య, బాలం సుబ్బరాయుడు, సిపిఐ నాయకుడు బాషా, ఆమ్ ఆద్మీ పార్టీ మండల కన్వీనర్ గౌస్, పీర్ బాష, మౌలా, తాజ్, సిరాజ్ లతో పాటు ఆయా రాజకీయ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి -ఖాజీపేట

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ శుక్రవారం మైదుకూరులో చేపట్టిన నిరసన నిరాహార దీక్షలో ఖాజీపేట నుంచి టిడిపి నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వర్యంలో పలు పంచాయతీలకు చెందిన నాయకులు నిరసన దీక్ష చేపట్టి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయం దుర్మార్గమని, ఇటువంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే ప్రజలు రానున్న ఎన్నికల్లో వైసిపికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. కార్యక్రమంలో కొత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, మైనారిటీ నాయకులు కమలాపురం ఫరూక్ అహ్మద్, రామానాయుడు, పిచ్చి నాయుడు, గోవింద్ సుబ్బయ్య, నంద్యాల సుబ్బయ్య యాదవ్, వీరయ్య, దాసరి రవి కుమార్ యాదవ్, దాసరి శ్రీనివాసుల యాదవ్, అంకాల్ యాదవ్, కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, తదితర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) :** టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా సి.యం. సురేష్ నాయుడు నేతృత్వంలో నిర్వహిస్తున్న 15వ రోజు నిరాహారదీక్షలకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వి.ఎస్.ముక్తియార్, శెట్టిపల్లి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పార్లమెంట్ ఆర్గనైజషన్ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి,రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, కె.ఖలీల్ బాషా , డాక్టర్ గౌస్, నిజాం, అల్తాఫ్, కాజా, ఆఫ్రిది, ముజీబ్, లాలూ, షరీఫ్ పలువురు టిడిపి మైనారిటీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దీక్షలు చేపడుతున్న టిడిపి నాయకులు